సాక్షి
బాపట్ల
శుక్రవారం । 28 । మార్చి । 2025



శ్రీ మడేలేశ్వర స్వామికి బోనాలు
గురజాల: మండలంలోని పులిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మడేలేశ్వర స్వామికి గురువారం భక్తులు బోనాలు సమర్పించారు.



ఈవీఎం గోడౌన్ తనిఖీ
ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపరచిన గోడౌన్‌ను డీఆర్‌ఓ ఎస్.షేక్ ఖాజావలి గురువారం తనిఖీ చేశారు.

అమ్మవార్లకు నిత్య పూజలు
భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు గురువారం నిత్య పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
బాపట్ల	6.25	4.49
గుంటూరు	6.25	4.49
నరసరావుపేట	6.27	4.51

న్యూస్‌రీల్

గిరిజన విద్యార్థులు చదువుల్లో రాణించాలి

రాష్ట్ర ఎస్టీ కమిషనర్ శంకరరావు



వేటపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర ఎస్టీ చైర్మన్, కమిషనర్ డీవీజీ శంకరరావు గురువారం పరిశీలించారు. విద్యార్థులను పాఠశాలల్లో అందుతున్న వసతులు, భోజన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భోజనాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలను పరిశీలించినట్లు తెలిపారు. వీరికి తహసీల్దార్ పార్వతి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. వీరి వెంట రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

పరమ పదనాథుడు అలంకారంలో నృసింహుడు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా గురువారం పరమ పద నాథుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వట్టిచెరుకూరు హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయండి

మంత్రి సవిత ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ శారదారాణిని తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. చేతికందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామని తెలిపారు.

యార్డులో 1,44,863 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,41,161 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,44,863 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,100 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,300 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 66,873 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్

- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తును కమిషరేట్‌కు సరెండర్ చేసిన కలెక్టర్
- కలెక్టర్ ఉత్తర్వులు ఖాతరు చేయక విధుల్లో కొనసాగుతున్న దేవదత్తు
- జిల్లాలో రెండువేలకుపైగా బెల్టు షాపులు
- మద్యం షాపుల్లో క్వార్టర్‌పై రూ.10 అదనంగా వసూలు
- బెల్టు షాపుల్లో రూ.50 అదనం
- ఒక్కొక్క మద్యం దుకాణం నుంచి ఎక్సైజ్‌కు రూ.15 వేలు మామూలు
- రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల ప్రాంతాల్లో విచ్చలవిడిగా నాటుసారా



బాపట్లలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం భవనం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: మద్యం షాపుల యజమానులు విచ్చలవిడిగా బెల్టుషాపులు నెలకొల్పారా? మద్యం దుకాణాల్లో ఒక్కొక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.10, బెల్టు షాపుల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారా? అయినా మాకేం సంబంధం లేదంటున్నారు ఎక్సైజ్ అధికారులు. ఎందుకు అంటే ప్రతిఫలంగా ఎక్సైజ్ అధికారులు ఒక్కొక్క మద్యం దుకాణం నుంచి నెలకు రూ.15 వేలు మామూళ్లు వసూలు చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. అంతటితో ఆగకుండా ప్రతి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు నిత్యం టీ, కాఫీలు మొదలు భోజనాలు, చికెన్, మటన్, ఫిష్ మద్యం సిండికేట్ నుంచే సరఫరా చేస్తున్నారని సమాచారం. మద్యం షాపుల అక్రమాలపై ఫిర్యాదులు కుప్పతెప్పలుగా వస్తున్నా నెలనెలా కప్పం కట్టించుకుంటున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తోపాటు మిగిలిన అధికారులు చర్యలకు ససేమిరా అంటున్నారు. ఎక్సైజ్ అధికారుల తీరుపై ఆగ్రహంతో జిల్లా కలెక్టర్ వెంకటమురళి స్పందించిన తీరే అందుకు నిదర్శనం.

మద్యం దుకాణాల అక్రమాలకు ఎక్సైజ్ దన్ను

జిల్లాలో 117 జనరల్ 10 కల్లు గీత కార్మికుల దుకాణాలతో కలిపి మొత్తం 127 మద్యం దుకాణాలుండగా దాదాపు అన్ని దుకాణాలు పచ్చనేతల స్వాధీనంలోనే ఉన్నాయి. వీరు రెండు వేలకు పైగా బెల్టు దుకాణాలు నెలకొల్పారు. మద్యం దుకాణాల్లోనే ఒక్కొక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 అదనంగాను, బెల్టుషాపుల్లో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు చేస్తూ మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్నారు. మద్యం షాపుల్లో డిమాండ్ ఉన్న బ్రాండ్లను బయటకు తరలించి అధికధరలకు విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదు. బెల్టుషాపులపై మొక్కుబడిగా దాడులు చేసి ఒక్కొక్క దాడికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులను ఎక్కువ సమయం వ్యాపారం చేసుకునేలా అనుమతిస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా జిల్లాలోని ఒక్కొక్క మద్యం దుకాణం నుంచి నెలకు రూ.15 వేలు చొప్పున 127 మద్యం షాపుల నుంచి నెలకు రూ.20 లక్షలు వసూలు చేస్తున్నారు. అంతటితో వదలక ప్రతి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు నిత్యం టీ, కాఫీలు మొదలు భోజనాలు, చికెన్, మటన్, ఫిష్ మద్యం షాపుల సిండికేట్ నుంచే తెప్పించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక రేపల్లె, వేమూరు, బాపట్ల,చీరాల, పర్చూరు ప్రాంతాల్లో నాటుసారా తయారీ దారుల నుంచి నెల మామూళ్లు పుచ్చుకొని నియంత్రణను గాలికొదిలారు. అన్ని రకాల వసూళ్లతో కలుపుకుంటే జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ నెలకు రూ.35 నుంచి రూ.40 లక్షలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదులు చెత్తబుట్టలోకి...

మద్యం ధరలు, బెల్టు షాపులు, నాటుసారా వ్యవహారాలపై ప్రజలు లేదా ప్రజాసంఘాలు ఫిర్యాదుచేసినా ఎక్సైజ్ విభాగం ఏమాత్రం స్పందించడంలేదు. దీంతో వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. వాటితోపాటు పత్రికల్లో వస్తున్న కథనాలపై విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిస్తున్నా దేవదత్తు ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. మొత్తంగా ఇప్పుడు ఎక్సైజ్ అక్రమాల వ్యవహారం రోడ్డెక్కడంతో కలెక్టర్ వెంకట మురళి ఆగ్రహంతో ఆ శాఖ అధికారిపై చర్యలకు దిగడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

కలెక్టర్ ఆదేశాలు ఖాతరు చేయని సూపరింటెండెంట్

మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలు జరపడం, బెల్టు షాపుల ఏర్పాటు, అక్రమ వసూళ్ల ఆరోపణలతోపాటు నాటుసారాను అరికట్టకపోవడం, మొత్తంగా విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నారన్న కారణంతో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తును జిల్లా కలెక్టర్ వెంకట మురళి కమిషరేట్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సోమవారంనాడు ఉత్తర్వులు ఇచ్చినా దేవదత్తు మాత్రం విధుల నుంచి రిలీవ్ కాలేదు. ఆయన పచ్చనేతలను ప్రసన్నం చేసుకొని ఉన్నత స్థాయిలో చెప్పించుకొని తిరిగి విధుల్లో కొనసాగే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. తను ఆదేశించినా దేవదత్తు రిలీవ్ కాకపోవడంపట్ల కలెక్టర్ ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై కలెక్టర్ అటు ఎక్సైజ్ కమిషనర్‌తోనూ మాటాడినట్లు తెలుస్తోంది. కలెక్టర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను సరెండర్ చేయడం ఆశాఖతోపాటు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

వైఎస్సార్ సీపీ జయకేతనం

- భయపెట్టినా..నిలబడ్డారు
- ప్రలోభాలకు లొంగలేదు
- పిట్టలవానిపాలెం ఎంపీపీ పదవి దక్కించుకున్న వైఎస్సార్ సీపీ
- పలు ఉపసర్పంచ్ పదవులు కైవసం



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎంపీపీ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: స్థానిక సంస్థలలో ఖాళీ స్థానాల భర్తీకి గురువారం జరిగిన ఉప ఎన్నికలలో పచ్చ పార్టీ కుట్రలు భగ్నమయ్యాయి. నామమాత్రమైన బలం లేక పోయినా పదవులను చేజిక్కించుకునేందుకు పచ్చ పార్టీ నేతలు చేసిన ప్రయత్నాలు వైఎస్సార్ సీపీ నాయకుల ఐక్యత ముందు పటాపంచలయ్యాయి. బాపట్ల జిల్లాలోని పలు స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు పచ్చపార్టీ పన్నిన కుట్రలు ఫలించలేదు. సొంత మండలం మండల పరిషత్ అధ్యక్ష పదవి కొట్టేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రలోభాలు, బెదిరింపులకు బెదరకుండా మెజార్టీ ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. గురువారం జరిగిన ఎన్నికలో తమ అభ్యర్థి సీతారామరాజును ఎంపీపీగా గెలిపించుకొని విజయకేతనం ఎగురవేశారు. పిట్టలవానిపాలెం ఎంపీపీగా ఉన్న చందోలు–1 ఎంపీటీసీ షేక్ బాజీ తన పదవికి రాజీనామా చేయడంతో ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. పిట్టలవానిపాలెం పరిధిలో మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, జీఎస్‌పాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, భవనంవారిపాలెం, సంగుపాలెం, చందోలు–1,2,3 స్థానాలతో కలిపి మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా గురువారం మండల పరిషత్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో సంగుపాలెం ఎంపీటీసీ గంగయ్య ఒక్కరే టీడీపీకి మద్దతు పలకగా మిగిలిన 10 మంది ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. ఎంపీపీ అభ్యర్థిగా పోటీకి దిగిన పిట్టలవానిపాలెం ఎంపీటీసీ దిండుకూరి సీతారామరాజుకు మద్దతుగా నిలిచి ఓట్లేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నికయ్యారు.

భట్టిప్రోలు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు సయ్యద్ నబీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం ఉపసర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికకాగా రేపల్లె మండలం పేటేరు ఉపసర్పంచ్‌గా టీడీపీకి మద్దతుదారు శ్రీదేవి, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు ఉపసర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారుడు శ్రీనివాసరావు, పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం ఉప సర్పంచ్‌గా టీడీపీ మద్దతు పలికిన వాసంతి విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికలో పిట్టలవానిపాలెం ఎంపీపీ పదవిని వైఎస్సార్ సీపీ దక్కించుకోవడంతో పార్టీ శ్రేణులలో నూతనోత్తేజం వచ్చింది. సంబరాలు చేసుకున్నారు.



ఎంపీపీగా ఎన్నికైన సీతారామరాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన, ఎంపీటీసీలు

నవ్వి పోదురుగాక..మాకేటి

- షాడో ఎమ్మెల్యేతో సీఎం పర్యటనపై చర్చలు
- మున్నాతో కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఆర్డీవో సంప్రదింపులు
- పర్చూరులో ఇసుక, గ్రావెల్, గ్రానైట్ దందాను నడిపిస్తున్న వ్యక్తిగా మున్నాపై ఆరోపణలు
- ఎమ్మెల్యే ఏలూరి తరఫున అక్రమ కార్యకలాపాలు
- మున్నాతో అధికారుల చర్చలపై నిర్ఘాంతపోతున్న అధికారులు, నేతలు
- ఐఅండ్‌పీఆర్ గ్రూపులో ఫొటోలు చూసి విమర్శలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అతనిపేరు మున్నా. అతనిది ఈ జిల్లా కాదు, ఈ రాష్ట్రం కాదు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం స్వస్థలం. కూటమి అధికారంలోకి వచ్చాక పర్చూరు ఎమ్మెల్యే అతనిని తన ప్రతినిధిగా పర్చూరులో తెచ్చి పెట్టారు. ఇప్పుడు మున్నా పర్చూరుకు షాడో ఎమ్మెల్యే. నియోజకవర్గంలో అందరినోళ్లలో అతనిపేరే నానుతోంది. అధికార వర్గాల్లోనూ అతని మాటే శాసనం. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం పెద గొల్లపాలెం గ్రామంలో ఏప్రిల్ 1న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం ఆ గ్రామంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ, జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడులు పర్యటించారు. సీఎం పర్యటన ఏర్పాట్ల గురించి మున్నాతో చర్చించడంతో ఇప్పుడు మున్నా పేరు మరోమారు హాట్ టాపిక్‌గా మారింది. అదేసమయంలో విమర్శలకు దారితీసింది. స్థానిక నేతల సంగతి పక్కనబెడితే అధికారులు సైతం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మున్నాతోనే చర్చించడంపై అక్కడున్న అధికారులతోపాటు స్థానిక నేతలు ముక్కున వేలేసుకున్నారు. పైగా అతనితో చర్చిస్తున్న ఫొటోలను పౌర సంబంధాల శాఖ మరీ గ్రూపులో పెట్టి ప్రచారం చేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అన్నింటా మున్నాయే...

పర్చూరు నియోజకవర్గంలో ప్రధాన వనరుగా ఉన్న గ్రానైట్ పాలీసింగ్ పలకలను ప్రభుత్వానికి సేల్‌టాక్స్, మైనింగ్ టాక్స్‌లు చెల్లించకుండా నిత్యం వంద నుంచి 120 లారీల గ్రానైట్ పలకలు ఇతర రాష్ట్రాలు, దేశాలకు తరలిస్తారు. ఈ దందాను ఎమ్మెల్యే అనుచరులు నడిపిస్తుండగా మున్నాయే పర్యవేక్షిస్తారన్న విమర్శలున్నాయి. ఇదే నియోజకవర్గంలో చినగంజాం మండలం కడవకుదురు ప్రాంతం నుంచి గత పదినెలలుగా హైదరాబాద్‌కు నిత్యం వందల లారీల ఇసుక తరలిపోతోంది. ఎమ్మెల్యే ఏలూరి తరుపున ఇసుక అక్రమ రవాణా వ్యవహారాలను మున్నానే పర్యవేక్షిస్తారన్న ఆరోపణలున్నాయి. ఇక నియోజకవర్గంలో ఇప్పటివరకూ ఉన్న గ్రావెల్ క్వారీల అనుమతులు బలవంతంగా రద్దు చేయించి మార్టూరు ప్రాంతంలోని కొండలనుంచి నిత్యం వందలాది లారీల గ్రావెల్‌ను తరలించి పెద్ద ఎత్తున అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ అక్రమ దందా వెనుక మున్నా హస్తముందని నియోజకవర్గంలో ప్రచారం వుంది. మొత్తంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు మున్నా షాడో ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారని నియోజకవర్గంలో విస్తృత ప్రచారం ఉంది.



మున్నాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

ముఖ్యమంత్రి పర్యటన పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ జే వెంకట మురళి
- చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం సందర్శించిన కలెక్టర్, ఎస్పీ
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చినగంజాం: ఏప్రిల్ 1వ తేదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు పర్యటన ఏర్పాట్ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జే వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1వ తేదీ చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీలు గురువారం సందర్శించారు. కొత్తగొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి దిగేందుకు అనుకూలంగా హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. 2 వేల మంది ప్రజలు కుర్చోవటానికి అనుకూలంగా సభాప్రాంగణం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా వేదిక వద్ద రెండు స్టాల్స్‌ని ఏర్పాటు చేయాల్సిందిగా డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సుమారు 4 గంటలపాటు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీఓలు తోట చంద్రశేఖర్ నాయుడు, రామలక్ష్మి, గ్లోరియా, చినగంజాం తహసీల్దార్ జీవిగుంటు ప్రభాకరరావు, ఎంపీడీఓ ఏ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు

- స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 కింద నిధులు
- కేంద్రం ఆమోదం తెలిపిందన్న పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్



సూర్యలంక బీచ్ (ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలోగల సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ స్వదేశీ స్కీమ్ 2.0 కింద రూ.97.52 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే సూర్యలంక బీచ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుందని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సరికొత్త హంగులతో పర్యాటకులను ఆకట్టుకోనుందని తెలిపారు. సూర్యలంక బీచ్‌లో పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేందుకు రూ.15.43 కోట్లు, షాపింగ్ స్ట్రీట్ అభివృద్ధికి రూ.4.37 కోట్లు, స్థిరమైన పర్యాటక అభివృద్ధి, పార్కింగ్ సౌకర్యానికి రూ.7.76 కోట్లు కేటాయించనున్నామని అన్నారు. కెనాల్ ఎక్స్‌పీరియన్స్ డెవలప్‌మెంట్‌కు రూ.11.69 కోట్లు, సూర్యలంక ఎక్స్‌పీరియన్స్ జోన్ కింద రూ.19.36 కోట్లు, ఇతర మౌలిక వసతుల కల్పన నిమిత్తం రూ.18 కోట్లు ఖర్చు చేయనున్నామని వివరించారు. అనంతరం ఇక్కడ కూడా బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ కోసం కృషి చేస్తామని తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి, పర్యాటకుల స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలతోకూడిన ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రానికి పంపించామని అన్నారు. స్పందించిన కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నిధుల విడుదలకు సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. కేద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి రూ.269.86 కోట్లు నిధులు విడదలయ్యాయని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే శాస్కి స్కీమ్ కింద అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్ట్‌లకు రూ.172.34 కోట్లు మంజూరుకాగా సంబంధిత పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. తాజాగా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్ల విడుదలకు ఆమోదం లభించిందన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్లటౌన్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రంజాన్ పండగను పురస్కరించుకొని గురువారం, సాయంత్రం పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పాల్గొని మాట్లాడారు. తొలుత ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మతంలో ప్రపంచంలో అందరూ ఒప్పుకునేది సహృద భావమన్నారు. అందులో ఎలాంటి వర్గాలు, కులాలు, భేదాలు, తారతమ్యాలు, వ్యత్యాసాలు లేకుండా అందరూ ఒకచోట గుమికూడి ప్రార్థన చేసుకునే సోదర భావంతో ఉంటుందన్నారు. ముస్లింలు హిందువులతో కలిసిపోయి అన్నదమ్ములుగా జీవిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న మతాలు ఉన్నా కలిసిమెలిసి జీవిస్తున్నారని అన్నారు. అన్ని మతాలవారు ఎప్పుడు కలిసి మలిచి సోదరుభావంతో మెలగాలన్నారు. ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్ మాసం అన్నారు. నెలవంక చూసినప్పటి నుండి ప్రారంభం అయ్యే ఈ మాసంలో ముస్లిం సోదరులు కఠోరమైన ఉపవాస దీక్ష చేపడతారన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షేక్ రోషన్ జమీర్ బాషా, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

31లోగా ఎక్స్‌గ్రేషియో క్లెయిమ్‌లకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: అసంఘటిత రంగ కార్మికుల ఎక్స్‌గ్రేషియో క్లెయిమ్‌ల పరిష్కారానికి, జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదించిన క్లెయిమ్‌లు ఈ–శ్రమ పోర్టల్ ద్వారా స్వీకరించేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పల్నాడు జిల్లా సహాయ కార్మిక కమిషనర్ జి.ధనలక్ష్మి పేర్కొన్నారు. సెటిల్‌మెంట్ ప్రక్రియ నియమ నిబంధనలు, షరతుల్లో ఏ మార్పులు లేవన్నారు. ఈ–శ్రమ పోర్టల్‌లో నమోదై 2022 మార్చి 31లోపు ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికులు, శాశ్వత అంగవైకల్యం పొందిన వారు ఎక్స్‌గ్రేషియో లబ్ధిపొందేందుకు ఆన్‌లైన్‌లో వారి డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో నమోదుచేసుకున్న ప్రతి కార్మికుడికి రూ.2లక్షల ప్రమాద, అంగవైకల్య బీమా ఉచితంగా కల్పించటం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కె.అవినాష్



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరం ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా కె.అవినాష్, ఉపాధ్యక్షులుగా కె.రవి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రామాంజనేయులు, జాయింట్ సెక్రెటరీగా ఎం.శ్యామలాదేవి, కోశాధికారిగా బి.చిరంజీవి మార్కండేయులు, మహిళా న్యాయవాది ప్రతినిధిగా జి.సువర్ణ నాగమోహినిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది యలవల నరేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఐ. రామాంజనేయులు వ్యవహరించారు. ఎన్నికలను ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ పర్యవేక్షించారు. ఎన్నికైన అభ్యర్థులను బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

మినుముల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన మినుములు, పెసలు కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ చెప్పారు. నల్లమోతువారిపాలెంలోని మినుముల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన రైతులతో మాట్లాడుతూ మినుములు, పెసలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రం ద్వారా మినుములు, పెసలు విక్రయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం మినుములు క్వింటాకు రూ.7,400లకు, పెసలు క్వింటాకు రూ.8,682 మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుమంత్‌కుమార్ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి రైతులు ఉన్నారు.

జాతీయ జట్టుకు ఖోఖో శిక్షణ

- నేటితో ముగియనున్న శిక్షణ
- రాష్ట్రంలో ఏ జట్టుకు అయిన పంగులూరులోనే శిక్షణ
- గ్రామస్తుల సహకారంతో 244వ ఖోఖో కోచింగ్ క్యాంప్



పోల్ డైవ్ వేస్తున్న క్రీడాకారుడు

జె.పంగులూరు: ఖోఖో క్రీడకు, పంగులూరుకు ఎంతో అనుబంధం ఉంది. ఈ గ్రామంలో ఉండి ఖోఖో ఓనమాలు నేర్చుకున్న ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకొని, భవిష్యత్తును తీర్చుదిద్దుకున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న ఖోఖో జట్టు కప్పుతో ఇంటికి రావాల్సిందే అంటే అతిశయోక్తి కాదు.

12 రోజుల శిక్షణ

మార్చి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశాలోని పూరిలో 57వ జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల ఖోఖో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టుకు పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, పంగులూరు గ్రామస్తుల సహకారంతో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ శుక్రవారంతో ముగియనున్నది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 15 మంది క్రీడాకారులు శిక్షణకు హాజరయ్యారు.

ఉత్తమ శిక్షణ

ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో మంచి ప్రావీణ్యం కలిగిన, నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8.30 గంటల వరకు శిక్షణ ఉంటుంది. క్రీడాకారులకు మంచి మెళకువలతో కూడిన శిక్షణను రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ స్థాపకులు మేకల సీతారామిరెడ్డి, ఎస్ఐఎస్ కోచ్ దేవిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో క్రీడాకారులను బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ప్రతి రోజూ క్రీడాకారులను పాలు, గుడ్లు, చికెన్, మటన్ వంటి పౌష్టికాహారం అదిస్తున్నారు.

ఖోఖో నా జీవితాన్నే మార్చేసింది



11 ఏళ్లుగా పంగులూరులో ఖోఖో ఆడుతున్నాను. మా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఇప్పటికి 20 సార్లు జాతీయ క్రీడల్లో పాల్గొన్నాను. 2023 గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో మూడో స్థానంలో నిలిచి బ్రాజ్ మెడల్ సాధించాను. ప్రస్తుతం క్రీడా కోటాలో మహారాష్ట్రలోని నాదెండ్‌లో రైల్వే క్లర్క్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం జాతీయ క్రీడలు ఆడేందుకు పంగులూరు వచ్చాను.

ఫణికుమార్, పంగులూరు

15 మంది క్రీడాకారులకు శిక్షణ



రాష్ట్ర ఖోఖో జట్టుకు పంగులూరులో శిక్షణ ఇస్తున్నాం. మంచి క్రమశిక్షణతో శిక్షణ తీసుకుంటున్నారు. ఉదయం 6 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి ఫ్లెడ్‌లైట్‌ల వెలుతురులో శిక్షణ ఇస్తున్నాం.

దేవిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఐఎస్ కోచ్

ఉన్నత స్థాయికి వెళ్లాలి



మాది చాలా పేద కుటుంబం. మా నాన్న బైక్ మెకానిక్. ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. మా అమ్మ వ్యవసాయ కూలి. కూలి పనులు చేసుకుంటూ నన్ను చదివిస్తుంది. నేను పదేళ్లుగా ఖోఖో ఆడుతున్నాను. ఇప్పటికి 16సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 37వ జాతీయ స్థాయి పోటీలలో బ్రాజ్ మెడల్ సాధించాను. స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం సంపాదించి మా అమ్మను బాగా చూసుకోవాలని ఉంది.

కే.వంశీ, అంతర్జాతీయ క్రీడాకారుడు, ప్రకాశం

పంగులూరులో శిక్షణ అంటే ఇష్టం



పంగులూరులో శిక్షణ అంటే నాకు చాలా ఇష్టం. ఇక్కడ చాలా సార్లు శిక్షణ తీసుకున్నాను. తొమ్మిది రోజులుగా 15 మంది జాతీయ స్థాయి క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. అందరు బాగా ఆడుతున్నారు. తప్పకుండా ప్లేస్ కొడతాం. నేను ఇప్పటికి 17సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నాను. రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించాను. ప్రస్తుతం స్పోర్ట్ కోటాలో పోస్టల్‌లో జాబ్ వచ్చింది.

నరసయ్య, టీమ్ కెప్టెన్

గ్రామస్తుల సహకారం మరువ లేనిది



మూడు దశాబ్దాలుగా పంగులూరు గ్రామస్తులు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగటరయ్య ఖోఖో క్రీడను, క్రీడాకారులను ఎంతో ఆదరిస్తున్నారు.

పంగులూరు గ్రామంలో రాష్ట్ర ఖోఖో జట్టుకు గ్రామస్తుల సహకారంతో 244వ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నాను. వారి సహకారంతో మరిన్ని క్యాంప్‌లు నిర్వహిస్తాం

మేకల సీతారామిరెడ్డి, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి

షిప్ యూనిట్లతో మాకు తీవ్ర నష్టం

- జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మత్స్యకార సంఘం నాయకులు



బాపట్లటౌన్: చిన్నగంజాం మండలంలో షిప్ బ్రేకింగ్ యూనిట్, షిప్ కన్‌స్ట్రక్షన్ యూనిట్ నిర్మించేందుకు సర్వేలు చేస్తున్నారని వదంతులు వినిపిస్తున్నాయని, అవే జరిగితే మేము జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని మత్స్యకారులు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మత్స్యకార సంఘం నాయకులు మాట్లాడుతూ మేమంతా చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నామని షిప్ యూనిట్లు వస్తే మా కాలువలు, మా ప్రాంత సముద్ర తీరం కలుషితమై మా జీవనోపాధి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. మా ప్రాంతంలో కొంత ఆక్వా సాగు, కొంత మేర ఉప్పు కొఠారు చేసుకొని దానిమీద ఆధారపడి వేలమంది జీవనం సాగిస్తున్నారన్నారు. చినగంజాం మండల తీర ప్రాంతంలో సుమారు 400 ఎకరాల లంక భూములు ఉన్నాయని, లంకల్లో మడ చెట్లు దట్టంగా పెరిగి ఉన్నాయని, అనేక సముద్ర జీవరాశులు వుంటాయని తెలిపారు. బాపట్ల, సూర్యలంక నుంచి ప్రకాశం జిల్లా కొత్తపట్నం వరకు టూరిజం అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. మా సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి మా ప్రాంతంలో షిప్ బ్రేకింగ్ యూనిట్ పెట్టకుండా చూడాలని కలెక్టర్ వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో మత్స్యకార సంఘం నాయకులు కొక్కిలిగడ్డ సుభాష్, కె. రామస్వామి, కె.ఇజ్రాయేలు, బి.అంకయ్య, వి.బాబురావు, కె.గోవిందు పాల్గొన్నారు.

జాతీయ కవి సమ్మేళనానికి అడుసుమల్లికి ఆహ్వానం



బాపట్లటౌన్: ఉగాది పండుగను పురస్కరించుకొని నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో శుక్రవారం జరిగే ద్విశతాధిక జాతీ య కవి సమ్మేళనానికి బాపట్లకు చెందిన ప్రముఖ సాహితీవేత్త అడుసుమల్లి మల్లికార్జునరావుకు ఆహ్వానం అందింది. జాతీయ కవి సమ్మేళనానికి ఎంపిక కావటంపై అడుసుమల్లి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ట్రాన్స్‌కో, రిటైర్డ్ అసోసియేషన్ కార్యదర్శి అలపర్తి నారాయణస్వామి, లైబ్రేరియన్ శివాజి గణేశానన్, సాయిబాబు, జీవీ తదితరులు అభినందించారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సీతారామరాజు, మాజీ ఎమ్మెల్యే కోన

మాజీ ఎమ్మెల్యే కోన

పిట్టలవానిపాలెం(కర్లపాలెం):కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా తుంగలో తొక్కిందని, ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ నాయకులందరం కలసి పోరాడదామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన దెందుకూరి సీతారామరాజుకు కోన శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు ఎంపీపీ సీతారామరాజు, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఎంపీటీసీ సభ్యులతో కలసి నివాళులర్పించారు. కోన మాట్లాడుతూ అధికారపార్టీ ఎన్నో ప్రలోభాలు పెట్టినా లొంగ కుండా ఐకమత్యంగా నిలబడి పార్టీ అభ్యర్థిని ఎంపీపీగా ఎన్నుకోవటం అభినందనీయమన్నారు. నాయకులు అశ్వనీరెడ్డి, అహ్మద్ హుస్సేన్, మండే విజయ్‌కుమార్, నారపరెడ్డి, కోటిరెడ్డి, ప్రకాష్, ప్రసన్నరాజు, శివారెడ్డి, మౌలాలి, వెంకటేశ్వరరెడ్డి, మాధవరావు,ధనగోవిందరెడ్డి, ధనుంజయ్ ఉన్నారు.

చీరాలకు క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు

- రూ.23.75కోట్లతో చీరాల ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటు
- ఈ యూనిట్ ఏర్పాటుతో గుంటూరు, విజయవాడ వెళ్లనవసరం లేదు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: ప్రధానమంత్రి ఆయుష్ మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకంలో భాగంగా రాష్ట్రానికి ఐదు క్రిటికల్ కేర్ యూనిట్లు మంజూరు కాగా అందులో ఒకటి చీరాలకు కేటాయించారని, దీంతో చీరాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చెప్పారు. గురువారం చీరాల ఏరియా వైద్యశాలలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో చీరాల ఏరియా వైద్యశాల అనేక ఆధునిక సౌకర్యాలతో నడుస్తుందన్నారు. ఈ క్రిటికల్ కేర్ యూనిట్‌తో ప్రాణసంకటమైన రోగులకు 50 పడకలతో నాలుగు అంతస్తుల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. ఇందులో ఐసీయూ, ఐసోలేషన్ వార్డు, ఆపరేషన్ థియేటర్, కాన్పులు, నవజాత శిశువుల సంరక్షణ, డయాలసిస్ సెంటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసిందన్నారు. జిల్లా కేంద్రంలో కాకుండా చీరాలకు కేటాయించడం పట్ల ఆయన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చీరాల ప్రాంతంలో 167ఏ, 216 రెండు హైవేలు అనుసంధానం అయ్యాయని, దీని వలన పెద్ద ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే గుంటూరు, విజయవాడలకు వైద్యం కోసం తరలించాల్సి ఉంటుందన్నారు. మార్గంమధ్యలోనే కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభమైతే ప్రాణాంతకమైన వాటికి మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలను మంగళగిరిలోని ఎయిమ్స్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల వసతులతో కూడిన వైద్యశాలగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైద్యశాల అభివృద్ధికి ఆర్థికంగా స్థోమత ఉన్న వారు తమ స్థాయిలో విరాళాలు అందిస్తే ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. అలానే కుందేరు ప్రక్షాళనకు రూ.89కోట్లు మంజూరయ్యాయని, డీపీఆర్ విధానం ద్వారా కుందేరులో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తామన్నారు. పీ–4 సిస్టమ్ ద్వారా కుందేరును అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిషింగ్ హార్బర్, చేనేత పార్కు వంటి నిర్మాణాలు త్వరలో పూర్తి చేస్తామన్నారు. 9 నెలల కాలంలో రూ.160 కోట్లు మేర అభివృద్ధి పనులకు అంచనాలను ప్రభుత్వానికి పంపించగా రూ.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి, అభివృద్ధి కమిటీ సభ్యులు బండారుపల్లి హేమంత్‌కుమార్, వలివేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్ జమ

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వినతి మేరకు ఫిబ్రవరి 2025 వరకు సీపీఎస్ నెల వారి చందాను ప్రతి నెలా ఉద్యోగుల ఆయా పీఆర్ఈఎఎస్ అకౌంట్లకు జమ చేయడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ గురువారం తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు కూడా వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాహనం ఢీ కొని వ్యక్తి దుర్మరణం

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొనడంతో ఆ వ్యక్తి అక్కడిక్కడే దుర్మరణం పాలైన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల కొండసమీపంలోని పండిట్ హోటల్ సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే జాతీయరహదారి కొండ సమీపంలో ఓవ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అతనిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి మృతిచెందాడు. నుజ్జునుజై గుర్తుపట్టలేని విధంగా మృతదేహం ఉంది. మృతుడు యాచకుడుగా స్థానికులు తెలిపినట్లు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మనస్తాపంతో బావిలో దూకి విద్యార్థిని ఆత్మహత్య



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

జె.పంగులూరు: ఇంటిల్లో పెద్దవారు మందలించారని మనస్తాపానికి గురై బావిలో దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాలు మేరకు.. బూదవాడ గ్రామానికి చెందిన విద్యార్థిని వలేరు ప్రవల్లిక (16) స్థానిక బూదవాడ గ్రామంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. పరీక్షలు అయిపోయి ఇంటి వద్దే ఉంటూ మిరపకాయల పనులకు వెళుతుంది. బుధవారం బూదవాడలోని పాఠశాలకు వెళ్లి కొంత సమయం స్నేహితులతో గడిపి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. అనంతరం ఇంటిలో నిద్రపోయింది. నిద్ర నుంచి లేచి కండువ తీసుకొని సాయంత్రం నుంచి మిరపకాయల పనికి పోయింది. పనికి పోయిన పిల్ల సాయంత్రం వరకు ఇంటికి రాకపోయే సరికి, పెద్ద రమాదేవి ఇరుగుపొరుగు వారిని ఆరా తీసింది. విషయం తెలియలేదు. చేసేది లేక గతంలో ఎవ్వరో అబ్బాయితో ఫోనులో మాట్లేడేదని ఇంట్లో పెద్దవారికి తెలిసింది. ఆ విషయమై మృతురాలిని మందలించడం జరిగింది. తోటి స్నేహితులను ఆరా తీసినా అమ్మాయి వివరాలు తెలియలేదు. చేసేది లేక గురువారం ఉదయం స్థానిక రేణిగవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం సాయత్రం మిరపకాయలు కోసి కూలీలు కాలనీకి సమీపంలోని బావి మీదగా వస్తున్నారు. రోడ్డు మీద వస్తూ బావిలో చూసే సరికి ఆడపిల్ల మృతదేహం నీటిపై తెలియాడుతు కనిపించింది. ప్రవల్లికగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు వలేరు అంజియ్య, పేరమ్మ మృతురాలు ప్రవల్లికను పెద్దమ్మ వలేరు రమాదేవి వద్ద ఉంచి రెండు నెలల కిందట పచ్చాకు పనికి వెళ్లారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు పెళ్లి చేయగా, రెండో అమ్మాయి డిగ్రీ చదువుతుంది. మూడో అమ్మాయి ప్రవల్లిక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఎప్పుడు ఆడుతూపాడుతూ తిరిగే పిల్ల మృతిచెందడంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రేమించి పెళ్లి చేసుకొన్న మూడేళ్లకే..



ఒంగోలుటౌన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న మూడేళ్లకే ఆమెకు నిండు నూరెల్లు నిండాయి. భర్తే ఆమెను చంపి ఉరివేసి వుంటాడన్న అనుమానంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం...బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన సోమిశెట్టి శ్రీనివాసరావు చిన్న కూతురు వాసంతి బీటెక్ చదువుకుంది. ఉద్యోగ నిమిత్తం ఒంగోలు వచ్చిన ఆమెకు ఒంగోలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన పమిడి రవికుమార్ పరిచయం అయ్యాడు. వారి స్నేహం ప్రేమగా మారింది. ఈ విషయాన్ని తండ్రికి చెప్పింది. అన్నీ తానై పెంచిన వాసంతికి పెద్దల సమక్షంలో వివాహం చేశారు. కొంతకాలానికే వారికి ఒక బాబు పుట్టాడు. ప్రస్తుతం ఆ చిన్నారికి ఏడాదిన్నర వయసు. ఉద్యోగ నిమిత్తం వాసంతి, రవికుమార్ దంపతులు హైదరాబాద్‌లోని బీరంగూడలో నివాసం వుంటున్నారు. చెడు వ్యసనాల బారిన పడిన భర్తకు ఇటీవల ఉద్యోగం పోయింది. కొత్త ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈలోపు ఏమి జరిగిందో ఏమో కాని బుధవారం రాత్రి బల్లికురవలోని మామ శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి మీ అమ్మాయి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయిందని చెప్పాడు. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లోనే ఉంటున్న వాసంతి సోదరి ఝాన్సీరాణికి కూడా చెప్పడంతో వారు బీరంగూడకు చేరుకున్నారు. ఝాన్సీ అక్కడకు వెళ్లే సరికే అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఒంగోలుకు తరలించాడు. గురువారం శ్రీనివాసరావు వచ్చి చూస్తే ఆమె ఒళ్లంతా గాయాలు ఉన్నాయి. ఏం జరిగిందని అడిగితే రవి సమాధానం చెప్పకుండా మోహం చాటేస్తున్నాడు. అనుమానం వచ్చిన శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలుకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.